ఆయిల్‌పామ్ సాగుపై రైతుల మొగ్గు

- ఏజెన్సీలో గణనీయంగా పెరుగుతున్న సాగు
- అంతర పంటలకు అనుకూలం
- ప్రభుత్వం సబ్సిడీ కోసం రైతుల ఎదురుచూపు



కివ్వాక గ్రామంలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలు

కుక్కునూరు: ఏజెన్సీ ప్రాంతంలో సంప్రదాయ పంటలను సాగు చేస్తున్న రైతులు ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, సరైన గిట్టుబాటు ధర లేకపోవడం, తదితర కారణాలతో ప్రతి ఏడాది నష్టాలను చవి చూస్తున్నారు. దీంతో ఇక్కడి రైతులు వంట నూనె దిగుబడి ఇచ్చే పంటల్లో ప్రధానమైన ఆయిల్‌పామ్ సాగును ఎంచుకుంటున్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో అధికారిక లెక్కల ప్రకారం 500 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నారు. ముంపు భూముల్లో సాగు చేసే పంటలను కలిపితే వేయి ఎకరాల వరకు ఉంటుందని అంచనా. ఈ పంటకు సాగునీరు అంతగా అవసరం లేకపోవడం, ఒండ్రు నేలలు ఈ పంట సాగుకు అనుకూలంగా ఉండడం, అంతర పంటలతో అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో పాటు పంట రేటు నిర్ణయం ప్రభుత్వం ప్రకటించిన విధంగా కంపెనీలు కొనుగోలు చేయాల్సి ఉండడంతో రైతులకు పెద్దగా నష్టం ఉండదనే ఆశతో నెమ్మదిగా ఆయిల్‌పామ్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

ముంపు పేరుతో విలీన మండలాల్లో అందని సబ్సిడీ

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం మొక్కలకు వంద శాతం సబ్సిడీపై అందిస్తుంది. కాని కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు పోలవరం ప్రాజెక్ట్ ముంపులో ఉండడంతో గత కొంత కాలంగా ప్రభుత్వం రైతులకు ఇచ్చే సబ్సిడీని నిలిపి వేసినట్లు తెలుస్తుంది. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వకపోవడంతో రైతులు కొందరు ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలని ఉన్నా పెద్దగా ఆసక్తి చూపలేదు. ఇతర పంటలు వేసి చేయి కాల్చుకోవడం ఎందుకని భావించిన రైతులు కొందరు మొక్కలను సొంతంగా కొనుగోలు చేసి ఆయిల్‌పామ్‌నే సాగు చేస్తున్నారు.

సబ్సిడీకి పరిష్కారం

ముంపు పేరుతో ప్రభుత్వం సబ్సిడీని అందించకపోవడంతో నిలిచిన ఆయిల్‌పామ్ సాగు ఇటీవల సమస్య పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు తాము సాగు చేసే భూమి ముంపులో లేదని తగిన ఆధారాన్ని చూపించాల్సి ఉంటుంది. సమస్యకు పరిష్కారం దొరకడంతో రానున్న రోజుల్లో ఆయిల్ పామ్ సాగు మరింత పెరిగి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో పూర్తి సబ్సిడీ అందలేదు



నేను కివ్వాక గ్రామంలో 15 ఎకరాల్లో ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తున్నాను. కుక్కునూరు మండలంలో ఇతర పంటలు పండించినా గోదావరి వరద, గిట్టుబాటు ధర సరిగా లేకపోవడం, పంటకు తెగుళ్లు ఆశించి దిగుబడి రాకపోవడం, తదితర కారణాలతో ఆయిల్‌పామ్ సాగును ఎంచుకున్నాం. కాని ప్రభుత్వం ముంపు పేరుతో పూర్తి సబ్సిడీని అందించలేదు. దీంతో మేమే సొంత పెట్టుబడితో మొక్కలను కొనుగోలు చేసి సాగును ప్రారంభించాం.

–తాండ్ర భాస్కర్‌రావు, రైతు, ముత్యాలంపాడు

సబ్సిడీ అందించేందుకు లైన్ క్లియర్



గతంలో కొన్ని ప్రత్యేక కారణాలతో ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు చేయాలకున్న రైతులకు సబ్సిడీ అందించలేదు. కాని గత కొన్ని రోజుల క్రితం హార్టీకల్చర్ డీడీ రామ్మోహన్‌రావు కంపెనీలతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఇప్పుడు ముంపులో లేని భూముల రైతులు మొక్కల కోసం దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్ నుంచి అప్రూవల్ రాగానే వారికి సబ్సిడీపై మొక్కలు అందుతాయి. ఆయిల్ పామ్‌లో సాగు చేసే అంతర పంటలకు కూడా సబ్సిడీ లభిస్తుంది. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు.

రాయపురెడ్డి నవీన,హార్టీకల్చర్ అధికారి, జీలుగుమిల్లి.

జామాయిల్ కంటే ఆయిల్‌పామ్ సాగే మేలు



విలీన మండలాల్లో జామాయిల్ సాగు కూడా అధికంగా ఉంది. ప్రస్తుతం రేటు బాగా ఉందని చాలా మంది రైతులు జామాయిల్ సాగును పెంచారు. జామాయిల్ అమ్మే సమయానికి ఇప్పుడున్న రేటు ఉండకపోవచ్చు. దీంతో నష్టపోయే అవకాశం ఉండడంతో నేను ఆయిల్‌పామ్ సాగును ప్రారంభించాను.

–శీలం లక్ష్మయ్య, నల్లకుంట గ్రామం, కుక్కునూరు

నేడు వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

చింతలపూడి: మండల వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం స్థానిక వీకేఎం ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీలపురెడ్డి రమేష్ రెడ్డి గురువారం తెలిపారు. దీనిలో భాగంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి హాజరవుతారని తెలిపారు. పార్టీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బెదిరింపు కేసు నమోదు

టి.నరసాపురం: మహిళను చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బొర్రంపాలెం గ్రామానికి చెందిన కుప్పాల పిచ్చమ్మ భర్త నాలుగు సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఈ నెల 6వ తేదీన బొర్రంపాలెం గ్రామ శివారు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో పిచ్చమ్మ మేకలను మేపుతుండగా అదే గ్రామానికి చెందిన గొడుగు జయ హనుమాన్ మద్యం సేవించి బైక్‌పై వచ్చి పిచ్చమ్మతో గొడవ పడి బూతులు తిడుతూ పీక నొక్కి చంపుతానని బెదిరించగా కేకలు వేసింది. చుట్టు పక్కల వారు రావడంతో పారిపోయాడు. పిచ్చమ్మ ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థులకు మొక్కల పంపిణీ



విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పరింపూడి బాలికోన్నత జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మొక్కలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు పెంచడం బాధ్యతగా స్వీకరిస్తే పర్యావరణానికి మేలు చేయడంతో పాటు మన ఆరోగ్యాన్ని మనం సంరక్షించుకోవచ్చని క్లబ్ అధ్యక్షుడు మాజేటి సత్యనారాయణ తెలిపారు. క్లబ్ ఆధ్వర్యంలో రెండు వేల మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మజ్జి సూరిబాబు, బోనగిరి పాపారావు, దారం సత్తిరాజు, చిరపూరి శ్రీనివాస్, బొమ్మ దుర్గబాబు, హెచ్‌ఎం ఉమాదేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం బహూకరణ



పాఠశాలకు సౌండ్ సిస్టమ్‌ను అందజేస్తున్న దాతలు

టి.నరసాపురం: మండలంలోని బండివారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామ పెద్దలు జూపల్లి శేషగిరిరావు, దాసరి రాంబాబు రూ.20 వేలు విలువ చేసే సౌండ్ సిస్టంను గురువారం బహూకరించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎండీ బాజా తెలిపారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీఎస్ అశోక్, కె.వేణు, కె.ఆదినారాయణ, ఇ.శ్రీను, ఆర్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కొయ్యలగూడెం: తల్లిపాలు బిడ్డకు అమృతమని బయ్యనగూడెం పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బయ్యనగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలే శిశువుకు సహజ సిద్ధమైన మొదటి టీకా అని, బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రిపాలు పట్టాలని, అవి బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని కలిగిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, ఏఎన్‌ఎమ్ రాట్నాలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు కె.శాంతికుమారి, పీఎన్‌బీ లక్ష్మీకాంతం, బి.కనకదుర్గ, పిఎమ్‌ఎల్ నాగమణి పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం



మండలంలోని దొరమామిడిలో సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని దొరమామిడి సర్పంచి తెల్లం రాముడు అన్నారు. మండలంలోని దొరమామిడి సచివాలయం వద్ద ఇటీవల బదిలీ అయిన సచివాలయ సిబ్బందిని గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులుగా మొదటి పోస్టింగ్ అందుకుని సుమారు 18 మంది వరకూ సిబ్బంది గిరిజన ప్రాంతంలో గిరిజనులకు ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి మద్ది పాటి శ్రీనివాస్, వార్డ్‌మెంబర్‌లు కాలింగి వెంకటేశ్వరరావు, సిలార్ ఖాన్, గ్రామ పెద్దలు చింతలపూడి వెంకటనారాయణ(బొండుబాబు), కూరం రాంబాబు, కార్యదర్శి గుండేపల్లి సోమరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కళింగ రామాలయంలో ప్రత్యేక పూజలు

ఉంగుటూరు: కైకరం కళింగ రామాలయం వద్ద ఆలయ వార్షికోత్సవ సందర్భంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. లక్ష్మీ గణపతి హోమం, సుదర్శన హోమం, ఆయుష్ సూక్త హోమాలు నిర్వహించారు. ఈ పవిత్ర హోమాలను నిడదవోలుకు చెందిన శుక్ల యజుర్వేద స్మార్త పండిట్ పొన్న రాజశేఖర్ గురుతత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కూనా అప్పారావు ఆధ్వర్యంలో జరిపిన కార్యక్రమంలో పది జంటలు పీటలుమీదకూర్చుని ఈ క్రతవులు నిర్వహించారు.

పెచ్చుమీరుతున్న టీడీపీ గూండాల దౌర్జన్యాలు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కామవరపుకోట: టీడీపీ గూండాల దౌర్జన్యాలు, దుర్మార్గాలు పెచ్చుమీరుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై తెలుగుదేశం కార్యకర్తలు కర్రలు, కత్తులతో దాడి చేసి హత్యాయత్నం చేయడం హేయమైన చర్య అని వారు అన్నారు. టీడీపీ ప్రభుత్వ దౌర్జన్యాలకు నిరసనగా మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ టీడీపీ అధికారం చేపట్టిన ఈ 14 నెలల్లో ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని సక్రమంగా అమలు చేయలేదని, పాలనను గాలికొదిలేసి ప్రతిపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేస్తుందని దుయ్యబట్టారు. జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ కె.రామకృష్ణ, వీరిశెట్టిగూడెం సర్పంచ్ దేవరపల్లి రామమోహనరావు, వైఎస్సార్ సీపీ టౌన్ ప్రెసిడెంట్ ఎన్.సాగర్, వైఎస్సార్ సీపీ నాయకులు సాయన కనకరాజు, బాబూరావు, ఉప్పలపాటి శ్రీనివాసరావు, కె.ఏ సుపాదం, గుర్రాల రవి, మోహన్‌రావు, ఎస్‌కే కరిముల్లా, చిలుకూరి సుబ్బారావు, టి.సుబ్రహ్మణ్యం, పోలిమెట్ల ప్రశాంత్, కొమ్మిన నరేష్, వాసే ఆనంద్, చింతనబోయిన సుబ్రహ్మణ్యం, తుమ్మల సీతారామయ్య, మానుకొండ దేవరాజ్, మెడంకి చిన్న తదితరులు పాల్గొన్నారు.

కూటమి దాడులతో ప్రజాస్వామ్యం ఖూనీ



నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ బీసీ నేతలు

చింతలపూడి: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల సమయంలో ఓటమి భయంతోనే కూటమి నాయకులు వైఎస్సార్ సీపీ బీసీ నేత ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకుడు వేల్పుల రాముతో పాటు పలువురిపై దాడి చేశారని స్థానిక వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు విమర్శించారు. గురువారం చింతలపూడిలో వైఎస్సార్ సీపీ నాయకులు పి.మాధవరెడ్డి ఇంటి వద్ద పట్టణ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీసీ నాయకులు ఎస్.దుర్గారావు, డోకల రాము,బందారు గోపి, జి.నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా పరిపాలన సాగిస్తుందని ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజా బలంతో గెలవాలి గాని దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి దాడులకు పాల్పడి గెలవాలనుకోవడం సరికాదన్నారు. బీసీ ఎమ్మెల్సీ పై దాడిని ముమ్మాటికి బీసీలపై రాజకీయ దాడిగానే భావిస్తున్నామని, భవిష్యత్తులో కూటమి ప్రభుత్వానికి బీసీలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్ఆర్సిపి మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటేశ్వరరావు, పట్టణ వైసిపి అధ్యక్షులు కొప్పుల నాగేశ్వరరావు, వైసీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షులు త్సల్లా బత్తుల శ్రీనివాసరావు, వైసిపి నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు చండీప్రియ,వైసీపీ నాయకులు ఎస్ కాంతారావు,ఎం ఇమ్మానియేలు,ఎండి రఫీ, ఆతుకూరి సుబ్బారావు, గోలి చంద్రశేఖర్ రెడ్డి, బందారు రమేష్,రామరాజు నాయక్,రాజేష్ నాయుడు,అజయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు పోరాటం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్

చింతలపూడి: మండలం సీఐటీయూ మహాసభ స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద గురువారం నత్తా వెంకటేశ్వర్రావు, టి మాణిక్యం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం, తరువాత కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను మార్పు చేసి కార్మిక వర్గాన్ని నష్టపరిచే నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆరోపించారు. ఇప్పటికే ఏపీలో కూటమి ప్రభుత్వం పని గంటల పెంపు, మహిళలకు రాత్రి షిఫ్టులు అమలు చేయడానికి సిద్ధమైందని, కర్మాగారాల్లో సేఫ్టీ అధికారుల తనిఖీలు లేక వందలాది మంది కార్మికుల ప్రాణాలు ఫ్యాక్టరీల విష వాయువుల్లో కలిసిపోతున్నాయని విమర్శించారు. స్కీమ్ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నేటి వరకు అమలు చేయటం లేదని అన్నారు. అనంతరం చింతలపూడి మండలం నూతన కమిటీ కన్వీనర్ గా నత్త వెంకటేశ్వరరావు, కో–కన్వీనర్లుగా సువర్ణ రాజు, ఆమని, టి.విజయరాజు, కమిటీ సభ్యులుగా భూక్య నాగరాజు, లావేటి వంశీ, బాలరాజు, వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణపై గ్రామసభ




గ్రామసభలో మాట్లాడుతున్న తహసిల్దార్ కె.స్లీవజోజి

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ భూమిలో నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణపై జంగారెడ్డి గూడెం బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వం జీవో 30 ప్రకారం ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణ దరఖాస్తులపై చర్చించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.స్లీవజోజి మాట్లాడుతూ 2019 అక్టోబర్ 15 నాటికి అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు భూమిలో గృహాలు నిర్మించుకున్న వారు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దీని ప్రకారం 210 మంది సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీటిని పరిశీలించి, విచారణ చేసి, అర్హులు, అనర్హుల జాబితాను తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ ఎస్‌వీవీ సత్యనారాయణ, లబ్ధిదారులు, ఆర్ఐ, వీఆర్‌వోలు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

చింతలపూడి: చింతలపూడి ఎంపీపీ (ఉర్దూ) పాఠశాలకు గురువారం అజీమ్ చారిటీ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు ఎస్‌కే ఆజాద్ బీరువా బహూకరించారు. చారిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తున్నట్లు ఆజాద్ తెలిపారు. చారిటీ నిర్వహకులకు విద్యార్థులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



ఏపీజీఎస్ సమావేశం నిర్వహిస్తున్న నాయకులు

వేలేరుపాడు: ఈ నెల 9న జరిగే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఏపీజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో పిట్ట ప్రసాద్ అధ్యక్షతన ఏపీజీఎస్ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మట్లాడారు. ఈ నెల తొమ్మిదో తేదీన జరిగే అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో పిట్టా వీరయ్య, బంధం అర్జున్, కంగాల గంగరాజు, తాటి దుర్గారావు, కరాటం వెంకటేశ్వర్లు, సోడే ప్రసాద్, మడకం దుర్గారావు, మచ్చ చంద్రరావు పాల్గొన్నారు.

శోభాయమానం.. కుంకుళ్లమ్మ ఆలయం



ఆలయాన్ని అలంకరించేందుకు మామిడి ఆకులను సిద్ధం చేస్తున్న మహిళలు



కూరగాయలతో ఆలయ ముఖ ద్వారాన్ని అలంకరిస్తున్న అర్చకులు, సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం పండ్లు, కూరగాయాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శ్రావణమాసం మూడో శుక్రవారం, వరలక్ష్మి వ్రత వేడుకను పురస్కరించుకుని గురువారం సాయంత్రం నుంచి అర్చకులు, సిబ్బంది ఆలయాన్ని పలు రకాల పండ్లు, వివిధ రకాల కూరగాయలు, వేపాకులు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. పలువురు మహిళా భక్తులు భక్తి ప్రపత్తులతో ఈ అలంకరణలకు సహకరించారు. అర్ధరాత్రి నుంచి అమ్మవారిని అర్చకులు ఫలాలు, కూరగాయలతో అలంకరించే పనులు చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారు శాకాంబరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యన్నారాయణ మూర్తి తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ సుబ్బారావు

చింతలపూడి: రైతులకు నాణ్యమైన ఎరువులు అందించడానికి కృషి చేయాలని వ్యవసాయ శాఖ ఏడీ వై.సుబ్బారావు అన్నారు. చింతలపూడిలో గురువారం ఎరువులు, పురుగు మందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీలర్లకు రిజిస్టర్ల నిర్వహణ, ఎరువుల అమ్మకాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ సర్కిల్‌లో రోజుకు ఒకటి రెండు పురుగుమందు తాగి చనిపోయిన కేసులు నమోదవుతున్నాయని, రైతులకు విక్రయించే పురుగు మందులు నిర్ధారణ చేసుకుని విక్రయించాలని ఆదేశించారు. ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ యూరియా, డీఏపీని రైతులకు విస్తీర్ణాన్ని బట్టి అందించాలని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ శ్యాంకుమార్, డీలర్లు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి

కొయ్యలగూడెం: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి కార్యక్రమం కన్నాపురం రోడ్డులోని గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత విశేషాలను వివరించారు. అనంతరం రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. 1861 మే 7వ తేదీన జన్మించిన ఠాగూర్ భారత జాతీయ గీతం జనగణమనతో పాటు బంగ్లాదేశ్ జాతీయ గీతాన్ని కూడా రచించారన్నారు. కేవలం రచయితే కాక ఆయన స్వాతంత్ర సమరయోధులు అన్నారు. వీరి రచనలు గీతాంజలి కాబూలీ వాల, గోరా ముఖ్యమైనవి ఉన్నాయన్నారు. గీతాంజలి ద్వారా నోబెల్ బహుమతి అందుకున్న మహోన్నత కవి రవీంద్రనాథ్ ఠాగూర్ అని వీరు 1941 ఆగస్టు 7వ తేదీన మృతి చెందారన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రచనలను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఆ గ్రామానికి బస్సుల సందడి

ద్వారకాతిరుమల: వెంకటకృష్ణాపురం.. అదో పల్లెటూరు. ఆ గ్రామంలోకి ఒక్క ఆర్టీసీ బస్సు కూడా వచ్చేది కాదు. అటువంటిది గత నెల రోజులుగా పదుల సంఖ్యలో ఆర్టీసీ బస్సులు ఆ ఊరి మీదుగా వెళుతున్నాయి. దాంతో గ్రామంలో సందడి నెలకొంది. కామవరపుకోట మండలం ఆడమిల్లిలో ప్రధాన రహదారిపై ఉన్న వంతెన ఇటీవల కూలిపోయింది. ప్రస్తుతం ఆ వంతెన నిర్మాణ పనులు చేస్తున్నారు. దీంతో ఏలూరు నుంచి జంగారెడ్డిగూడేనికి వెళ్లే ఆర్టీసీ బస్సులన్నీ వెంకట కృష్ణాపురం, ద్వారకాతిరుమల మీదుగా వెళుతున్నాయి. దీంతో వెంకటకృష్ణాపురం గ్రామంలో బస్సుల సందడి నెలకొంది. ఏలూరు, జంగారెడ్డిగూడెంకు వెళ్లే ఆ గ్రామస్తులు ఇప్పుడు బస్సుల కోసం ద్వారకాతిరుమలకు వెళ్లకుండా, తమ గ్రామం నుంచే ప్రయాణిస్తున్నారు.